# చూడచక్కగా.. చకచకా...

- శరవేగంగా టీటీడీ కూడలి ఆధునికీకరణ
- పూర్తయిన కాబుల్ స్టోన్ వర్క్ పనులు
- జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకల పునరుద్ధరణ
- శ్రీవారి శంఖు చక్ర నామాలతో కనువిందు చేయనున్న కూడలి


ఎంవీపీ కాలనీలో ఆధునికీకరిస్తున్న టీటీడీ కూడలి

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు వేగం పుంజుకున్నాయి. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం(ప్రాజెక్ట్స్) ఈ కూడలి అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. గతంలో పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం జరగ్గా.. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రస్తుతం శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు విభాగం రూపొందించిన ప్లాన్‌కు అనుగుణంగా సర్వాంగ సుందరంగా కూడలిని తీర్చిదిద్దుతున్నారు. ఆధునికీకరణ పనుల కోసం నెల రోజులుగా కూడలి మీదుగా వెళ్లే వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. నిర్మాణంలో ప్రధాన భాగమైన కాబుల్ స్టోన్ వర్క్ పనులు ఇటీవల పూర్తికావడంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మరో రెండు వారాల్లో ఫౌంటెయిన్ నిర్మాణం సైతం పూర్తిచేసి టీటీడీ జంక్షన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీవీఎంసీ ప్రాజెక్టు విభాగం వెల్లడించింది.

**చివరి దశకు పనులు**

రూ.1.07 కోట్లతో టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులను ఏడాది కిందట అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టింది. ఇందులో భాగంగా సర్కిల్ చుట్టూ ప్రత్యేక డిజైన్‌తో కూడిన కాబుల్ స్టోన్ వర్క్, బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి, ఫౌంటెయిన్ల నిర్మాణం, శ్రీవారి శంఖు చక్ర నామాల ఏర్పాటు పనులు చేపట్టాలి. గతంలో ఫౌంటెయిన్ నిర్మాణం కోసం వృత్తాకారంలో గోడలు కట్టడం, వాటి మధ్యలో పిల్లర్ల నిర్మాణం అనంతరం పనుల నిర్వహణలో అంతరాయం ఏర్పడింది. జీవీఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులు కూడలి ఆధునికీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కాంట్రాక్ట్ సంస్థకు నిర్దిష్ట సూచనలు చేయడంతో నెల రోజుల్లో పనులు వేగం పుంజుకుని కొలిక్కి వచ్చాయి. రికార్డ్ సమయంలో కూడలి చుట్టూ కాబుల్ స్టోన్ నిర్మాణం పూర్తయింది. దీంతో నెల రోజులుగా వాహనాల రాకపోకలు నిలిపేసిన అధికారులు ఇటీవల పునరుద్ధరించారు. బ్యూటిఫికేషన్, గ్రీనరీ అభివృద్ధి పనులు సైతం చివరి దశకు చేరుకున్నాయి.

**రెండు వారాల్లో అందుబాటులోకి..**

ప్రస్తుతం జంక్షన్ మధ్యలో ఫౌంటెయిన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇది పూర్తయిన అనంతరం ట్రయిల్ రన్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు వారాల్లో టీటీడీ కూడలి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పనులు పూర్తయితే మరో అందమైన శ్రీవారి శంఖు చక్ర నామాలతో కూడిన కూడలి నగరవాసులను కనువిందు చేయనుంది.


కూడలి మధ్యలో ఏర్పాటవుతున్న ఫౌంటెయిన్, శ్రీవారి శంఖు చక్ర నామాల నమూనా


జంక్షన్ చుట్టూ పూర్తయిన కాబుల్ స్టోన్ వర్క్ నిర్మాణం

## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**ఆరిలోవ:** హనుమంతవాక ఫీడర్ 11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెదగదిలి, ఎస్సీ కాలనీ, సాలిపేట, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం తదితర ప్రాంతాలతోపాటు అంబేడ్కర్‌నగర్ ఫీడర్‌లో 11 కేవీ పరిధి శ్రీకాంత్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

**సెక్టార్–1 వెంకోజీపాలెంలో..**

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సెక్టార్–1 కొత్త వెంకోజీపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### ఫిట్‌నెస్‌పై అవగాహన


అవగాహన కార్యక్రమంలో ట్రైనర్ జాన్


**బీచ్‌రోడ్డు:** నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ఫిట్‌నెస్ చాలా అవసరమని ఇంటర్నేషనల్ ఫిట్‌నెస్ ట్రైనర్, గ్లోబల్ అథ్లెట్ జాన్ కార్పథక్కిస్ అన్నారు. నగరంలోని ఎఫ్45 ఫిట్‌నెస్ సెంటర్‌లో గురువారం ఫిట్‌నెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం, కుటుంబం, సాంఘిక బాధ్యతల మధ్య ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటామన్నారు. ఫిట్‌నెస్‌కు సమయం కేటాయించడం మన శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మన శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచడానికి ఫిట్‌నెస్ సహాయ పడుతుందన్నారు.

### సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.23 లక్షలు


హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

**సీతమ్మధార:** నగరంలోని ఆశీలమెట్టలో ఉన్న శ్రీ సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 35 రోజులకు గాను 23 లక్షల 33 వేల 349 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.శిరీష తెలిపారు. నగదుతోపాటు వెండి 456.600 గ్రాములు, 161 యూఎస్ డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 10 యూఏఈ దిర్హామ్స్, రూ.111 చెక్ రూపంలో వచ్చాయన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ బోశన్‌తో కలిసి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారుగా ఎం.శ్రీధర్ వచ్చారు. లెక్కింపులో శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది ఎ.గోవిందరెడ్డి, ఇ.ప్రసాద్, భక్తులు బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

### రైల్వే ఉద్యోగులందరికీ అధికార భాషపై శిక్షణ


హిందీ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం లలిత్ బోరా, అధికారులు

**తాటిచెట్లపాలెం:** దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. అధికారిక భాషా అమలులో అనుసరించాల్సిన పలు విషయాలను రాజభాషా విభాగం సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా రాజభాషా అధికారి, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల్లో అధికారిక భాషా అమలు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగులందరికీ అధికారిక భాషపై, టైపింగ్‌లో అవసరమైన శిక్షణ ఇచ్చి, దైనందిన కార్యకలాపాల్లో హిందీ భాష వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్ఎం లలిత్ బోరా సూచించారు. అనంతరం హిందీ మ్యాగజైన్ విశాఖ వాణిని డీఆర్ఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, (ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలమాంబ హుండీ ఆదాయం రూ.6.81 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

**బీచ్‌రోడ్డు:** పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం గురువారం ఈవో గాయత్రి పర్యవేక్షణలో నిర్వహించారు. రెండు నెలలకు గానూ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.6,81,853 నగదు, 140 గ్రాముల బంగారం, 2.25 కేజీల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు తవిటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భవితకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీడీపీవో రమణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

**సీతమ్మధార:** భావిభారత పౌరులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలని ఐసీడీఎస్ విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో రమణకుమారి అన్నారు. నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణ భీ పడాయి కార్యక్రమంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల లోపు పిల్లలకు సంరక్షణ ఇస్తూ పోషకాహారాన్ని వారి తల్లులకు అందిస్తామన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు భాష, అంకెలు నేర్పిస్తామని చెప్పారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఏమేం చేయాలన్న అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, వినీషాసుందరి, జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చూపు తిప్పుకోనివ్వని ఆర్కిడ్ ఫ్లవర్స్





పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లో అరుదైన.. అందమైన ఆర్కిడ్ జాతికి చెందిన ఫాలెనోప్సిస్, డెండ్రోబియం పువ్వులు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఈ పార్క్‌లో ఎన్నో అరుదైన జాతులకు చెందిన మొక్కలను పెంచుతున్నట్లు నిర్వాహకుడు ఎం.రామామూర్తి తెలిపారు. ఆర్కిడ్ జాతి పువ్వులను ఇంట్లో అలంకరణ కోసం పెంచుతుంటారని చెప్పారు. ఈ పువ్వులు అద్భుతంగా వికసిస్తాయని, చూడటానికి ఎంతో అందంగా.. ఆకర్షణీయంగా ఉంటాయని వర్ణించారు. జీవవైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన ఆర్కిడ్ జాతి పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయన్నారు.

– బీచ్‌రోడ్డు

## ఐక్యతతోనే పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

**తాటిచెట్లపాలెం:** పెన్షనర్లంతా ఐక్యతతో ఉంటే సమస్యల సాధన సులభమవుతుందని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్. పట్నాయక్ అన్నారు. రైల్వేన్యూకాలనీ సమీపంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం జరిగిన పెన్షనర్ల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుకోవాలంటే అందరూ ఐక్యంగా సాగాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరులో కేరళలోని కొచ్చిన్‌లో జాతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పెన్షన్‌దారుల సభ్యత్వం 1500కు చేరుకుందని, ఆలిండియాలో లక్షకు చేరువలో ఉందన్నారు. మనలో మాణిక్యాలు పేరిట వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు పెన్షన్‌దారులను సత్కరించారు. అవార్డులు అందుకున్న వారిలో రామశర్మ(కార్టూన్ రంగం), టి రాజేశ్వర్(అంతర్జాతీయ పర్యాటకం), కేవీడీ స్వామి(సీజీహెచ్ఎస్)లు ఉన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.సోమసుందరరావు, అడ్వైజరీ శ్రీమన్నారాయణ, కోశాధికారి పిన్నింటి బాబూరావు, సీనియర్ నేత శర్మ, ఇతర పింఛన్‌దారులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**మద్దిలపాలెం:** ఆప్కోస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం జోన్–5 పరిధిలోని 49, 50, 51, 52 వార్డులకు సంబంధించి కార్మికులను ఉద్దేశించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొల్లపల్లి సుబ్బారావు 2వ వర్ధంతి ఏప్రిల్ 1న షీలానగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అన్ని వార్డుల ఆఫీసుల వద్ద ఉదయం కామ్రేడ్ సుబ్బారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించాలన్నారు. ఏప్రిల్ 2న 10.30 గంటలకు రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి బహిరంగ సభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

### 'విశాఖ ఉడ్ డెకార్స్' నూతన కమిటీ ఎన్నిక

**ఆరిలోవ:** విశాఖ ఉడ్ డెకార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పైనాపిల్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కార్పెంటర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కందూరి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా ఆరిపాక మురళీమోహనరావుతోపాటు కోశాధికారి, ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లు, సహాయ కార్యదర్శి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను సంఘ చైర్మన్ కానూరు లక్ష్మణరావు అభినందించారు.

### నేటి నుంచి షిర్డీసాయి మందిర ఉత్సవాలు

**ఆరిలోవ:** జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని షిర్డీసాయిరాం మందిర 27వ వార్షికోత్సవం శుక్రవారం ప్రారంభం కానుంది. ఉగాది వరకు జరగనున్న ఈ ఉత్సవాల కోసం ఆలయాన్ని కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు బాబాను దర్శించుకొని పూజలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 28న ఉదయం నుంచి బాబాకు విశేష పూజలు చేయనున్నారు. 29న 108 కలశాలతో క్షీరాభిషేకం, 30న సాయి సామూహిక సత్యవ్రతాలు, పల్లకీ సేవ, చావడి ఉత్సవం, పరస నిర్వహించనున్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు.

### పోక్సో కేసుతో భవిష్యత్తు అంధకారం


పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అదనపు న్యాయాధికారి వెంకటరమణ

**సీతమ్మధార:** స్థానిక పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎస్ఎంసీ హైస్కూల్‌లో గురువారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కోర్టు 1వ అదనపు న్యాయాధికారి ఎం.వెంకటరమణ విద్యార్థులకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం–2012 లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. శారీరకంగా లేదా మానసికంగా ఎవరు వేధించినా పిల్లలు ఫిర్యాదు చేస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని, తగిన రక్షణ కల్పిస్తారని చెప్పారు. జీవించే హక్కు, చదువుకునే హక్కు, స్వేచ్ఛగా ఉండే హక్కులను కాపాడటానికి, నేరాల తీవ్రత తగ్గించడం కోసం పిల్లలకు సత్వర న్యాయం అందించడానికి పోక్సో చట్టం ద్వారా త్వరగా విచారించి శిక్షలు విధిస్తారన్నారు. ఈ చట్టం గురించి విద్యార్థులు శ్రద్ధగా విని, తెలుసుకొని ఇంటి చుట్టుపక్కల వారికి, బంధుమిత్రులకు తెలియజేయాలని కోరారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైన వారికి భవిష్యత్ అంధకారమేనని అదనపు న్యాయాధికారి వెంకటరమణ హెచ్చరించారు. ఉప విద్యా శాఖాధికారి సోమేశ్వరరావు, కౌన్సిలర్ శకుంతల, అన్ని కుమారి, కార్మిక శాఖ ఆఫీసర్ విజయశ్రీ, ద్వారకా స్టేషన్ ఎస్ఐ శ్రీను, ఐసీడీఎస్ అధికారి రమణి, బేగం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్రంగులకు అండగా నిలవండి


ఆరిలోవ కాలనీలో ఆలయం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరుతున్న కార్పెంటర్లు

**ఆరిలోవ:** ఆరిలోవ ప్రాంతంలో గురువారం కార్పెంటర్స్ దినోత్సవాన్ని కార్పెంటర్ల అసోసియేషన్లు ఘనంగా నిర్వహించాయి. రాష్ట్ర కార్పెంటర్ల వడ్రంగి అసోసియేషన్ ఆధ్వర్యంలో చెక్కతో తయారు చేసిన వడ్రంగి పనిముట్లను ఆటోలు, ద్విచక్ర వాహనాలపై అమర్చి ప్రదర్శించారు. ఆరిలోవ కాలనీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద పనిముట్లు అమర్చిన ఆయా వాహనాలతో అసోసియేషన్ సభ్యులు ర్యాలీగా బయలుదేరి హనుమంతవాక, మద్దిలపాలెం, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా జగదాంబ వద్ద లేపాక్షి కూడలి వరకు సాగించారు. ఈ సందర్భంగా వారంతా వడ్రంగి వృత్తి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వడ్రంగుల యోగక్షేమాలను ప్రభుత్వం తెలుసుకొని పట్టించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పెంటర్ల సంఘం పెద్దలు వేముల కన్నప్రసాద్, బేతాల సన్యాసిరావు, పూడి సురేష్, చిట్టూరి కృష్ణ, తవిరి శ్రీనివాస్, గోవింద్, రాజేష్, శివాజీ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ప్రపంచ రంగస్థల దినోత్సవం


సినీనటుడు ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు


తులసి తీర్థం నాటికలోని ఓ సన్నివేశం

**విశాఖ విద్య:** ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఆంధ్రా యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రాంగణంలోని కె.వి.గోపాలస్వామి థియేటర్‌లో తులసీ తీర్థం హాస్యనాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శించారు. వేడుకలకు హాజరైన సినీ నటుడు ప్రసన్నకుమార్‌ను ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావులు సన్మానించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రంగస్థలాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, థియేటర్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.భాస్కర్‌రావు, శశిభూషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణ తరగతులు

**దాబాగార్డెన్స్:** దాబాగార్డెన్స్‌లో గల ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కమిటీ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఉచితంగా సంగీత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సంస్థ కార్యదర్శి పి.జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి 50 ఏళ్లలోపు విద్యార్థులు, స్త్రీ, పురుషులు కులమతాలకతీతంగా శిక్షణలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆకొండి వెంకట్రావు శాస్త్రీయ సంగీతంపై శిక్షణ అందజేయనున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు 63026 61211, 83092 20060 నంబర్లలో సంప్రదించవచ్చు. ఏప్రిల్ 6న ఉదయం 6 నుంచి 8 గంటలలోపు రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్రస్వామి ఆలయంలో దరఖాస్తులను పొందవచ్చని పేర్కొన్నారు. శాస్త్రీయ సంగీతం, అన్నమాచార్య సంకీర్తనలు, పురందరదాసు సంకీర్తనలు, వేణుగానంపై ఉంటుందన్నారు.

## మీరు మారరా..!



ట్రాఫిక్ నియమ నిబంధనలపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా.. ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినా.. ఎంత జరిమానాలు విధించినా.. కొంత మంది వాహన చోదకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ముఖ్యంగా యువత ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలతో రెచ్చిపోతున్నారు. మితిమీరిన వేగం, జిగ్‌జాగ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌లతో చెలరేగిపోతున్నారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయం వద్ద హెల్మెట్ ధరించకుండా.. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ.. ఫోన్ మాట్లాడుతూ స్కూటీపై వెళ్తున్న దృశ్యమే ఇందుకు నిదర్శనం.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## భక్తిశ్రద్ధలతో షబే ఖదర్


విద్యుత్ దీపాలంకరణలో బుల్లయ్య కాలేజీ వద్ద గల యాసీన్ మసీదు

**జగదాంబ:** షబే ఖదర్ వేడుకను ముస్లింలు గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో తెల్లవారుజాము వరకు ప్రత్యేక నమాజ్, ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలో 26వ రోజున రాత్రి షబే ఖదర్ వేడుక జరుపుకుంటారు. ఈ సందర్భంగా మౌల్వీలు షబే ఖదర్ వేడుక విశిష్టతను వివరించారు. రంజాన్ మాసంలోనే షబే ఖదర్ రోజున పవిత్ర ఖురాన్ అవతరించినట్లు గ్రంథంలో ఉన్నట్టు తెలిపారు. తెల్లవారు వరకు జాగరణ అనంతరం ఉపవాస దీక్ష చేశారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు..